# శాంతి కోసం

సత్యం మనసు మనసులో లేదు. భార్యకీ అతనికీ సరిగా పడటం లేదు. ప్రతి చిన్న విషయమూ ఏదో పెద్దగొడవగానే అంతమౌతోంది. ఈ కోపంతోనే ఆమె అమ్మగారింటికి వెళ్ళిపోయిందని అతని అనుమానం. అతనితో సోమవారం నాడు వచ్చేస్తానని చెప్పింది కాని ఆనాడు రాలేదు. మరునాడు మంగళవారం ఎలాగూరాదు. బుధవారంనాడు తను తప్పక స్టేషనుకు వెళ్ళాలనుకున్నాడు. ఈ చిలిపి కయ్యాలకు ఏదోవిధంగా స్వస్తి చెప్పకపోతే ఇక లాభం లేదనుకున్నాడు.

ఆమె ఏమైనా అంటేసరి తను కస్సుమని లేస్తున్నాడు. తనకు యిదొకటి అలవాటైపోయింది. ఆమె మాత్రం మనిషి కాదా ఏమిటి? ఏదో ఒకటి అంటుంది. కర్రా, కర్రా రాచుకుని నిప్పు రాలినట్లు, మాటా మాటా ఢీకొని పోట్లాట పెరుగుతోంది. దీనికంతటికీ తను సావిత్రిని సరిగా అర్థం చేసుకోక పోవడమే కారణం. తను ప్రేమతో ఆమెనొకనాడూ పలుకరించలేదు. ఆమెను మనిషిగా తను ఏనాడూ చూడలేదు. తనకోసం ఆమె ఎంత ప్రాకులాడుతున్నా తను అన్నింటికీ ఏవో వంకలు పెడుతూ ఆమెను గేలిచేస్తున్నాడు. ఏడిపిస్తున్నాడు. ఇక ఎప్పుడూ అలా చేయకూడదు. బుధవారంనాడు స్టేషనుకు వెళ్ళి ఆమెను ఇంటికి తీసుకురావాలి. ఒక్కసారిగా ఆమె ఎప్పుడూలేంది స్టేషనుకు వచ్చారే అనుకుంటుంది. ఎంతో ఆశ్చర్యపోతుంది. ఆనందిస్తుంది కూడాను అనుకున్నాడు. బుధవారంనాడు స్టేషనుకు వెళ్లాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

ఆనాడు స్టేషనుకు వెళ్తూ వెళ్తూ తను ఇలా చేస్తే సావిత్రికి లోకువైపోయతానేమో అనుకున్నాడు. భయపడ్డాడు. ఛీఛీ!... సావిత్రి అలా ఎప్పుడూ అనుకోదు. పైగా ఎంతో సంతోషిస్తుంది అనుకున్నాడు.

స్టేషనులో బండి గంటన్నర లేటైనా ఓపిగ్గా కూర్చున్నాడు. ఇంతకీ సావిత్రి

వస్తుందో... రాదో అనుకున్నాడు. అలా అనుకొని, 'రాకపోతేనా... ఇంక ఎలాగొస్తుందో చూస్తాగా... ఎన్నేళ్ళేడుస్తుందేం అక్కడ...' అనుకున్నాడు. అతనిలో కోపం రగులుకుంది. కాని అప్పుడే అతని మనసు, 'ఇదిగో సత్యం... అప్పుడే నువ్వు మారిపోతున్నావు. ఇది తప్పయ్యా... ఆమె ఎన్నాళ్ళు రాకపోయినా నువ్వు ఓపిక పట్టగలగాలి. అప్పుడు ఇక సావిత్రి నీ అడుగులకు మడుగులొత్తుతుంది, లేకపోతేనా - ఏముంటుంది? మళ్ళీ ఎప్పటి మాదిరే... మీ గొడవలూ, మీరూ మిగులుతారు. అంతే' అంది. పాపం సత్యం ఓపికపట్టాడు. మనసు చెప్పిన మంచిమాట విన్నాడు.

ఇంతలో బండి వచ్చింది. సత్యం గుండె దడదడలాడింది. తను ఎక్కడ కోపంగా మాట్లాడేస్తానో అనుకున్నాడు. శాంత వచనాలు మనసులో మననం చేసుకున్నాడు.

బండిలో సావిత్రి కోసం ఈ చివర నుండి ఆ చివర వరకూ వెదికాడు. కాని 'ఏదీ సావిత్రి...!' ఉసూరుమనిపోయింది ప్రాణం. బండి సత్యానికి పుట్టెడు దుఃఖాన్ని అంటగట్టి కదలిపోయింది.

సత్యం వంటరిగా ఇంటికి కాళ్ళీడ్చుకొచ్చాడు. పళ్ళు పటపట కొరికాడు. 'రాదు... రాదు... ఇకరాదు...' అని మనసులో గిజగిజ కొట్టుకున్నాడు. 'ఇక రానియ్ చెప్తాను. గుమ్మం ఎలా తొక్కుతుందో చూస్తాగా! హుఁ... ఎంత పొగరెక్కిపోయింది. సోమవారం నాడు వచ్చేస్తానని సన్నాయి నొక్కులు నొక్కింది... అన్నీ అబద్ధాలే... దాన్ని ఏమి చేసినా పాపం లేదు. ఈ హోటలు మెతుకులు ఎలా తింటారనుకుంటోందో? దానికేం పోయింది? అమ్మగారింటి దగ్గర హాయిగా ఉంది. ఇక్కడ మొగుడెలా పోతే ఏం? చచ్చినా దానికిష్టమే...'

పాపం సత్యం ఆ పూట అన్నం మానేశాడు. ఆకలితో అలాగే నిద్రపోయాడు.

ఆ రోజున తెల తెలవారుతూందనగా, అతను తిరిగి తిరిగి అసలు నిర్ణయానికే వచ్చాడు. 'పాపం అక్కడ ఏం అడ్డంకులు వచ్చాయో? కారణం తెలుసుకోకుండా కోపగించుకోవడం ఏమంత మంచిది కాదు. వస్తుందిగా! అప్పుడు మెల్లగా కారణం అడగాలి. నిజంగా అప్పుడు కోపగించుకోవలసిన విషయాలున్నా కోపగించుకోగూడదు. అలా చేస్తేనే తన జీవితం సుఖంగా నడుస్తుంది. తను కోపాన్ని జయించాలి. ఆమె ఎన్నాళ్ళు ఆలస్యం చేసినా సరే' అనుకున్నాడు.

మళ్ళీ అతనే, 'అసలు నేను ఆ ఎంగిలి కప్పుల హోటళ్ళలో కాఫీ తాగటానికి ఎంతో అసహ్యించుకుంటానని తెలిసి కూడా ఇలా చేస్తుందా... దానికసలు జాలిలేదు. ఉంటే ఇలా ఎక్కడైనా ఇబ్బంది పెడుతుందా... మంచిదట మంచిది. ఎవరు చెప్తారో

చెప్పమను. అప్పుడే ఈ సంగతి అందరూ అనుకుంటూనే ఉంటారు. పెళ్ళానికి వీడు లోకువ. ఆ ఆసరా చూసుకునే ఆ పిల్ల అమ్మగారింటి దగ్గర కులుకుతూంది అంటారు. ఇందులో ఏమీ అబద్ధం లేదు. వాళ్ళు తప్పకుండా అలా అనుకుంటూనే ఉంటారు. అప్పుడే ఈ పొరుగిళ్ళ ఆడవాళ్ళు, నేనింటికి వస్తూండగా తలుపులు చేరేసుకొని ఎలా నవ్వుతున్నారో. అంతా విషపు నవ్వు. వాళ్ళకెందుకో మా గొడవ. మా ఆవిణ్ణి పుట్టింటి దగ్గర సంవత్సరాల తరబడి ఉంచుకుంటాను. వాళ్ళకెందుకు. ఈ ఇంటిగలావిడ ఒకర్తి. అబ్బ చంపేస్తుంది. 'అబ్బాయ్... అమ్మాయి ఇంకా రాలేదేం నాయనా...' అంటూ. ఛీఛీ, చస్తే అద్దిళ్ళల్లో ఉండగూడదు. అసలు ఈ ముసలిదానికెందుకు? వస్తే వస్తుంది లేకపోతే లేదు. ఉప్పో చింతపండో అదేమిటో కావలిస్తే నన్నడిగి తీసుకపోరాదూ.

'అసలు నేను ఇన్ని తలవంపులు భరిస్తున్నా... ఆ సావిత్రమ్మ గారికి చీమైనా కుట్టినట్టు లేదు. నేనంటే భయముంటేగా, ముఖం మాత్రం ఏమీ ఎరుగని నంగనాచిలా పెడుతుంది. మనసులో నేనంటే ఆమెకెంత చులకన. అందుకనే అప్పుడప్పుడు నాలుగు తగలనివ్వాలి. అబ్బ! ఆరోజు భయంకరం బాబు. తను మాట్లాడడు, ఆమె మాట్లాడదు. తెల్లార్లూ ఇద్దరికీ నిద్ర ఉండదు. మళ్ళీ ఎప్పుడో మాట్లాడుకోవడం. అది మాట్లాడాలని తను... తను మాట్లాడాలని అది, చివరికి ఎవరూ మాట్లాడకుండానే ఊరుకోడం. తనకు ఆమెతో మాట్లాడాలనే ఉంటుంది. కాని తను ముందుగా మాట్లాడేస్తే, ఇంక ఆమె తనను తేలిక చేసెయ్యదూ.. అప్పుడదే పాపం తనను పలకరిస్తుంది. కాని అప్పుడు తను బిర్రబిగిసిపోతాడు. ఒక్కొక్కప్పుడు మరి తనే ముందుగా పలకరిస్తాడు. అప్పుడామె తిన్నగా ఉండదు. తనను ఏదో ఒకటి అంటుంది. ఇక చూడండి అప్పుడు గాజు పెంకుతో రక్కినట్లుగానే ఉంటుంది. మళ్ళీ తమ మూతులు మరో వారం ముడుచుకుపోతాయి. ఆమె అటు; తను ఇటు అబ్బబ్బ! ఈ తలనొప్పి గొడవ ఇక అంతం చేయకపోతే బతుకు దుర్భరం అవుతుంది. ఆమె ఎన్ని రోజులు ఆలస్యంగా వచ్చినా సరే తియ్యగా ఆహ్వానించాలి. కోపాన్ని జయించాలి' అనుకున్నాడు.

కాని సావిత్రి ఆ మరునాడు కూడా రాలేదు. అతని ముఖం పొగబారిన వంటవసారా గోడలా నల్లగా మాడిపోయింది. ఆ తరువాత రెండు రోజులుకూడ ఆమె కోసం చూశాడు. కాని ఆమె రాలేదు. ఆమె కోసం అతని మనసు ఎంత తపిస్తూందో పాపం, ఆమె అతనికంత చిరాకును తెచ్చి పెడుతోంది. అయినా అతను

ఓపిక వహించాడు. ఆదివారం నాడు తప్పదు... తప్పక వస్తుంది అనుకున్నాడు. ఇప్పటి వరకు ఇంత సహనాన్ని తను ప్రదర్శించ గలిగినందులకు తనను తనే అభినందించుకున్నాడు. ఇక ఇప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలనుకున్నాడు. పొరపాటున కూడ నోరు జారగూడ దనుకున్నాడు. కయ్యానికి కాలు దువ్వరాదనుకున్నాడు.

మెల్లగా స్టేషనుకు హాజరయ్యాడు. అతని మనసులో ఎవరో, 'ఒకవేళ ఈ రోజున ఆమె రాకపోతే... ఇక అప్పుడు నువ్వేం చేస్తావ్ సత్యం.?' ఎగతాళిగా వికవికనవ్వారు. సత్యం కడుపులో చేయి పెట్టి తిప్పినట్లయింది. అతని తల తిరిగింది. కాని అతను తను ఇక ఏ రూపంలోనూ కోపగించుకోగూడదని తిరిగి నిశ్చయించుకున్నాడు. కోపాన్ని కటకటాల వెనుక పడేసి, పట్టుదల తాళం బిగించేశాడు.

ఇంతలో బండి వచ్చేసింది. సావిత్రి కోసం అతని కళ్ళు వెదికాయి. బండి మెల్లగా ఆగుతోంది. సావిత్రి వంగి పెట్టెలు, బుట్టలు గుమ్మం దగ్గరకు సర్దుకుంటోంది. ఒక్కసారిగా 'వచ్చింది... వచ్చింది' అని అతని గుండె స్పందించింది. సత్యం గబగబా పరుగెత్తాడు.

భర్త దగ్గరకు వస్తోందన్న మాటేగాని, సావిత్రి మనస్సు మనసులో లేదు. ఈ ఆలస్యానికి కారణాలు తను ఆయనకు సరిగా వివరించగలనా లేదా అని భయపడింది. ఆ సమయంలో ఆయన ఏమన్నా పడి ఊరుకోవాలి. ఇక గొడవ పెంచుకోరాదు అనుకుంది. మాటకు మాట తెగులు, నీటికి నాచు తెగులని, మాట మాట అనుకోవడం వల్ల, గొడవ పెరగడమే గాని సుఖం లేదనుకుంది. తలెత్తి పోర్టరును కేకేయాలని స్టేషనువైపు చూసింది. ఆమె తనను తనే నమ్మలేక పోయింది. ఆగుతూన్న బండితో భర్త పరుగెత్తుకుంటూ వస్తున్నాడు.

"ఏవి... ఆ పెట్టెలిలా ఇయ్యి" అంటూ వాటిని అతను కిందికి దింపాడు. మెల్లగా ఆమె చేయి పట్టుకొని ఆమెను దించాడు. ఆమె కిందికి దిగుతూ దిగుతూ ఉండగా బలే తమాషగా "మమ్మల్ని మరచిపోయినట్లుందే" అన్నాడు.

అంతే, ఆమె ఒక్కసారిగా విస్తుపోయింది. ఆమె హృదయంలో వేయి విసన కర్రలతో చల్లగా మృదువుగా విసిరినట్లయింది. ఆమె ఆనందంతో ఏమీ మాట్లాడలేక పోయింది.

పోర్టరు సామాను బయట రిక్షాలో పెట్టాడు. రిక్షా ఇంటికి నడుస్తూండగా అతను గబాలున, "నువ్వు పద సావిత్రీ... నేనిప్పుడే వస్తాను. తాళంచెవి దగ్గర ఉందిగా..." అంటూ "ఏయ్ రిక్షా అబ్బాయ్ ఆపు" అని తోవలో దిగిపోయాడు. రిక్షా ఇంటిదారి పట్టింది.

సావిత్రి, ఇదేమిటి ఆయన తోవలో దిగి పోయారేమిటి అనుకుంది. ఆ సమయంలో

ఆమెకు ఏమనడానికి మాట పెగిలిరాలేదు. 'ఈ ఎండలో ఎక్కడకండీ?' అనబోయింది. కాని ఎక్కడ కస్సుమంటాడో అని ఊరుకుంది. అతని వాలకం చూస్తూ ఉంటే ఆమెకు విపరీతమైన భయం వేసింది. ఇంతమార్పు ఎల్లా వచ్చింది అనుకుంది. ఇదంతా నిజమా అనుకుంది. తనను శిక్షించడానికి అతను ముందుగా తయారు చేసుకున్న పథకం కాబోలు అనుకుంది. ఇంటి దగ్గర ఏం బాధలు పెడతాడో అని హడలిపోయింది. అతను ఇంకా గురిచూడకపోయినా, గుళ్ళునింపిన తుపాకి సిద్ధంగా అతని భుజాన ఉన్నట్లు బితుకు బితుకుమంది. 'భగవంతుడా ఆయన నన్ను కోప్పడకుండా చెయ్యి,అంతే చాలు'. ఆ తిట్లు నేను భరించలేను. ఇక నేను నోరు మెదపను. ఈ బాధలనుంచి నన్ను బయటపడేయి భగవంతుడా' అని మనసులో లోలోన ప్రార్థనలు సల్పింది.

రిక్షా దిగి గదిలో సామాను సర్దుకుంది. ఇంట్లో అతని బట్టలూ అవీ నానా బీభత్సంగా పడి ఉన్నాయి. పుస్తకాలు అక్కడొకటీ, ఇక్కడొకటీ అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. చాకలి బట్టలు తెచ్చాడు కాబోలు, ఆ బట్టల మూటకూడా అక్కడే పడి ఉంది. అందులో తన చీర ఒకటి ఇదేమిటి అలా నలిగిపోయి చిలక కొయ్యను వ్రేలాడుతూంది అని ఆశ్చర్యపోయింది. ఇదేమిటి అది ఇక్కడ ఉంది అనుకుంది. ఇదంతా చూస్తూ ఉంటే తుఫాను ముదు ఉండే వాతావరణంలాగే ఉంది అనుకుంది. ఏమైనా సరే తనుమ్మాత్రం ఇక పల్లెత్తు మాట ఆయనను అనగూడదు అని గట్టిగా నిశ్చయించుకుంది.

ఇంతలో అతను హడావుడిగా లోపలకు వచ్చాడు. అతని నవ్వు ముఖాన్ని చూడగానే సావిత్రి మనసు నిమ్మళించింది. సరాసరి అతను ఆమె దగ్గరకు వచ్చి చేతిని వెనక్కు పెట్టి, ఏమిటో చెప్పుకోచూద్దాం అన్నట్టుగా నవ్వాడు. ఆ నవ్వు ఎంత తియ్యగా ఉంది! సావిత్రి ఇక ఉండలేకపోయింది. "ఏమిటండీ... అది...?" అంది విప్పారిన కళ్ళతో.

"ఏమిటో చెప్పుకో" అన్నాడతను.

సావిత్రి చాలా చాలా ఆనందించింది.

"సరి... ఇది మరీ బాగుంది. నాకెలా తెలుస్తుంది" అంది.

"అంతేనా ఈ మాత్రం చెప్పుకోలేవూ" అన్నాడతను.

సావిత్రి - పువ్వులు వచ్చి మీద పడుతూన్నట్లు, బీటలు పడిన పుడమి గుండెలో వర్షపు ధారలు ప్రవహించినట్లు - మహదానందాన్ని అనుభవించింది. స్వర్గసుఖమంటే ఇదే ఇదే అనుకుంది.

"చెప్పండీ..." అంది గోముగా.

జవాబుగా అతను, "అమ్మగారు పాపం ప్రొద్దున్ననగా ఎప్పుడు తిన్నారో, ఆకలిగా లేదూ?" అన్నాడు.

"అయితే?" అంది. ఆమె కళ్లు కుతూహలంతో మెరిశాయి.

"అందుకు బహుమతిగా ఈ పొట్లం అందుకోండి" అన్నాడు. ఎంతో చక్కగా నవ్వాడు. ఆ పొట్లంలో గులాబిజాములు, కాజాలు, జహంగీరులు దిట్టంగా ఉన్నాయి.

వెంటనే ఆమె, "ఎందుకండీ ఇవి" అంది.

డబ్బు దండగ అనబోయి మానేసింది. అతనికి కోపం వెంటనే వచ్చేసేదే. ఇంతలోనే ఆమె, "మీకు ఇష్టమని జున్ను తెచ్చానండి. అందుకనే ఆలస్యమైంది. గేదె ఇవ్వాళ ఈనుతుందని, రేపు ఈనుతుందని ఏరోజు కారోజు ఆగిపోవలసి వచ్చిందండీ" అన్నది.

ఒక్కసారిగా సత్యం, కళ్ళతో సావిత్రిని జుర్రుకున్నాడు. నేను ఓపిక వహించడం ఎంత మంచి పనయింది అని తనను తనే కొనియాడుకున్నాడు. వెంటనే "ఏమిటీ .... జున్నా .... ఇంకా దాచావేం... ఇలా పట్టుకరా... ఇవి నీకు, అది నాకు. ఏం?" అంటూ గుణుస్తూ ఆమెను తొందరచేశాడు.

అప్పుడే ఆమె ఏమిటేమిటో అతన్ని అడగాలనుకుంది. మెల్లగా, "చాకలి బట్టలు ఎప్పుడు తెచ్చాడూ" అంది. అలా అని ఇంకా మెల్లగా, "ఆ చీర అలా విప్పేసుందేం?" అంది. దీనికి జవాబుగా ఏమంటాడో అని భయపడుతూ అతని కళ్ళల్లోకి చూసింది. ఈ ప్రశ్న ఎందుకు వేశాను, ప్రస్తుతం మానేసినా బాగుండును అనుకుంది.

కాని ఆమె భయపడినట్లుగా జరుగలేదు. సత్యం హుషారుగా, "ఓ .... అదా ....నాకు చలేస్తే కప్పేసుకున్నాను" అన్నాడు.

సావిత్రి హృదయంలో హరివిల్లులు విరిశాయి.

"అదేమిటండీ దుప్పట్లున్నాయిగా..." అంది. అలా అని ఆమె తనలో ఇదేమిటి... ఇలాంటి మాటలు అనగూడదనుకుంటూనే అనేస్తున్నాను అనుకుంది.

కాని అతను చూపులతో నవ్వి "ఏం దుప్పట్లే కప్పుకోవాలని ఎక్కడేనా తీర్మానించారా?" అన్నాడు; ఆమె కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ, జున్ను ముక్కలు మెల్లమెల్లగా తింటూ.

సావిత్రి మనసులో ఎన్నెన్నో మనోహరమైన ఊహలు తలఎత్తాయి. తన భర్త ఎంత మంచి వాడు! తను ఇన్నాళ్లు అతన్ని అర్థం చేసుకోలేకపోయింది. ఎంత చక్కని హృదయం వారిది అనుకుంది. స్టేషనులో దిగి, రిక్షా ఎక్కినప్పటినుంచి ఎప్పుడడుగుదామా ఎప్పుడడుగుదామా అనుకుంటూన్న ముక్క ఈసమయంలో,

ఇంతటి ఆనందాన్ని అనుభవిస్తూన్న ఈ శుభసమయంలో అడగాలని ఆమె ఎంతగానో ఉవ్విళ్ళూరింది. సత్యం వైపు చిలిపిగా చూస్తూ, మెల్లగా మధురంగా "రైలు దగ్గర అంతమంది ఉన్నారనైనా సిగ్గులేకుండా అలా అన్నారేం" అంది.

అతను "ఎలా అన్నాను.?" అన్నాడు కొంటెగా ఆమెవైపు చూస్తూ.

"పోండి. ఇలాంటి మాటలు ఎప్పుడు నేర్చుకున్నారు" అంది. అక్కడ నుంచి లేచిపోయింది.

"కాదు... చెప్పు..." చేయి పట్టుకున్నాడు అతను.

"బాగుందండీ... ఇది మరీను. మీ మాటలు నన్ను చెప్పమంటారేం...?" అన్నది.

"నేను మరచిపోయాను సావిత్రీ చెప్పవూ?" అన్నాడతను గోముగా.

సత్యం కళ్ళల్లోకి సావిత్రి అలాగే చూస్తూ ఊరుకుంది.

"ఊఁ..." అన్నాడతను.

ఆమె అప్పుడు చెప్పింది. సిగ్గుతో చీరకొంగు వేలికి ముడివేసుకుంటూ చెప్పింది. "మమ్మల్ని మరచిపోయినట్లుందేఁ... అన్నారేం...?" అలా అంటూ లోనికి గబగబా వెళ్ళిపోయింది. సత్యం ఆమెను అలాగే చూస్తూ నిలబడిపోయాడు.

ఆ రాత్రి సావిత్రి ఎంతో ఆనందంతో సత్యాన్ని మరొక చిన్న ప్రశ్న వేసింది. ప్రశ్న వేయలేదు. తన సొద తాను చెప్పుకుంది. 'ఆలస్యమైనందుకు మీరు ఏమి చేస్తారో అని భయపడిపోయానండి" అని.

పాపం ఆనాటినుంచి శాంతికోసం పడుతూన్న తపనలో మునిగిపోయి ఉన్న సత్యానికి వెంటనే ఆమెకేమి చెప్పాలో తోచలేదు. కాని మెల్లగా, "అదే సావిత్రీ... కోపాన్ని జయించటానికి ప్రయత్నిస్తున్నాను" అన్నాడు ఎంతో అలసిపోయినట్లుగా, నిస్పృహగా, నిరాశగా.

ఈ మాట వినగానే సావిత్రి ఒక్కసారిగా కాళ్ళూ చేతులూ చల్లబడిపోయిన దానిలా అయిపోయింది. "ఏమీ మాట్లాడలేకపోయింది. "అయ్యో! ఎంత కష్టపడుతున్నారు" అని అనుకుందో లేక ఇంకేం అనుకుందో ఏమో? మెల్లగా "నాకిదేం నచ్చలేదండి. మీరు మునుపటిలా వుంటేనే బాగుంటారు" అని అనబోయింది. కాని అనలేక పోయింది. అతని తలలోకి వేళ్లు పోనిచ్చి మెల్లగాఅతన్ని మరింత తన దగ్గరకు లాక్కుంది.

(ఆనందవాణి, 4-12-1955)